ఉష్ణోగ్రత (అంచనా)

23-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	38	26
తెనాలి	37	27
నరసరావుపేట	39	25
బాపట్ల	36	27
రెంటచింతల	40	26
చీరాల	36	27

వసూళ్లపై.. ఉపేక్ష

- పన్ను బకాయిలు రూ.225.46 కోట్లు
- వసూళ్లపై పుర పాలకులు మీనమేషాలు
- వసూళ్లపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- మున్సిపాలిటీల్లో జీతాల చెల్లింపులకు ఇక్కట్లు



నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో ఆస్తి, నీటి పన్నుల బకాయిలు పేరుకుపోతున్నాయి. వసూళ్లపై పుర పాలకులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు. పన్నుల వసూళ్లపై అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. దీంతో పట్టణాల్లో ప్రగతి కుంటుపడుతోంది. మున్సిపాల్టీలకు ప్రధాన ఆదాయ వనరైన పన్నులు సక్రమంగా వసూలు కాకపోతుండటంతో ఉద్యోగుల జీతాల చెల్లింపులకు ఇక్కట్లు నెలకొంటున్నాయి. ఏళ్ల తరబడి ఉన్న బకాయిలను వసూలు చేయడంలో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు న్నాయి. పన్నుల ఆదాయాన్ని పెంచుకుని స్వయం సమృద్ధి సాధించాలన్న ప్రభుత్వ సూచనలను పెడచెవిన పెడుతున్న పరిస్థితులు గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీల్లో నెలకొంది. ఆస్తి పన్ను బకాయిలు రూ.225.46 కోట్లు ఉండగా నీటి పన్ను బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. ఏళ్ల తరబడి ఉన్న బకాయిలను వసూలు చేయడంలో యంత్రాంగం అలసత్వాన్ని ప్రదర్శిస్తోందన్న విమర్శలు న్నాయి. వసూళ్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఆస్తి పన్ను బకాయిలతో పాటు నీటి పన్ను బకాయిలు కూడా రూ.కోట్లలో పేరుకుపోయాయి. మూడు జిల్లాల్లో రూ.225.46 కోట్లు పన్నుల బకాయిలు ఉంటే ఒక్క గుంటూరు కార్పొరేషన్‌లోనే రూ.174.82 కోట్లు బకాయిలు ఉండటం గమనార్హం. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట మున్సిపాల్టీలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థల బకాయిలు రూ.3.07 కోట్లు ఉండగా ప్రైవేట్ భవనాల బకాయి రూ.3.77 కోట్లు ఉంది. పెద్దఎత్తున బకాయిలు పేరుకుపోవడంతో కొన్ని మున్సిపాల్టీల్లో కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. రూ.వందల కోట్లు పన్ను బకాయిలు పేరుకుపో వడంతో మున్సిపాల్టీలో ప్రగతి పనులు చేపట్టే పరిస్థితులు కానరావడం లేదు. చాలా మున్సిపాల్టీల్లో చేసిన పనులకే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలేదు. దీంతో కొత్తగా పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు.

ఏటేటా పెరుగుతోన్న బకాయిలు

పన్ను బకాయిలు ఏటా పెరుగుతున్నాయే తప్ప వసూలవుతున్న దాఖలాలు లేవు. ప్రైవేట్ ఆస్తులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్తులకు సంబంధించిన బకాయిలు కూడా భారీగానే ఉన్నాయి. ప్రభుత్వ సంస్థల బకాయిలు సక్రమంగా వసూలు కావడంలేదు. పల్నాడు జిల్లాలో రూ.21.77 కోట్ల ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. ప్రైవేట్ భవనాలు, ఖాళీ స్థలాలకు సంబంధించి రూ.13.87 కోట్లు బకాయిలు ఏళ్ల తరబడి ఉన్నాయి. గుంటూరు జిల్లాలో రూ.193.85 కోట్లు పేరుకుపోయాయి. ప్రైవేట్ భవనాలు, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు 152.86 కోట్లు ఉన్నాయి. బాపట్ల జిల్లాలో ఆస్తి పన్ను 9.84 కోట్లు బకాయిలు ఉండగా ఇందులో ప్రైవేట్ భవనాలు, ఖాళీ స్థలాలవి రూ.5.78 కోట్లు ఉన్నాయి.

మున్సిపాల్టీల వారీగా బకాయిలు..

మున్సిపాల్టీ	బకాయిలు (రూ.కోట్లలో)
పల్నాడు జిల్లా	
నరసరావుపేట	7.71
చిలకలూరిపేట	3.56
సత్తెనపల్లి	3.22
పిడుగురాళ్ల	1.86
మాచర్ల	3.16
వినుకొండ	0.89
దాచేపల్లి	0.80
గురజాల	0.57
గుంటూరు జిల్లా	
గుంటూరు కార్పొరేషన్	174.82
మంగళగిరి.. తాడేపల్లి	9.66
తెనాలి	7.98
పొన్నూరు	1.39
బాపట్ల జిల్లా	
చీరాల	4.13
బాపట్ల	3.51
రేపల్లె	1.42
అద్దంకి	0.78

ప్రభుత్వ బకాయిలూ రూ.కోట్లలో..

గుంటూరు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు సంబంధించి రూ.29.21 కోట్లు, కేంద్ర సంస్థలు, కార్యాలయాల బకాయిలు రూ.11.78 కోట్లు ఉన్నాయి. బాపట్ల జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సంస్థల బకాయిలు రూ.27 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల బకాయిలు రూ.3.79 కోట్లు, పల్నాడు జిల్లా పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు సంబంధించి రూ.7.14 కోట్లు బకాయిలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించి రూ.76 లక్షలు బకాయిలు ఉన్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి.

ఖాళీ స్థలాల పన్నులపై అలసత్వం

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వేలల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఆయా ఖాళీ స్థలాల పన్నులు ఏళ్లుగా పేరుకుపోయాయి. స్థలాల క్రయవిక్రయాలు జరగడంతో యజమానుల చిరునామాలు లభించని పరిస్థితి. దీంతో ఖాళీ స్థలాల పన్ను వసూళ్లకు సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. ఒక్క గుంటూరు కార్పొరేషన్‌లోనే ఖాళీ స్థలాలకు సంబంధించి రూ.83.94 కోట్లు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి.



చిలకలూరిపేట రూరల్ మండలంలో ప్రత్యేక అలంకరణలో బొప్పూడి ఆంజనేయ స్వామి



వినుకొండ పట్టణంలో ప్రత్యేక అలంకరణలో శ్రీ గుంటి ఆంజనేయస్వామి

శ్రీ ఆంజనేయం

వైభవంగా హనుమత్ జయంతి

అంజనీపుత్రుడికి విశేష అభిషేకాలు, పూజలు

నరసరావుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాం జనేయం. జై హనుమాన్.. జైజై హనుమాన్ అనే భక్తుల నామస్మరణలతో రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలు మారుమోగాయి. హనుమత్ జయంతి వేడుకలు గురువారం జిల్లావ్యాప్తంగా వైభవంగా జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో అంజనే యస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష అలంకారాలు చేశారు. సుందరకాండ హోమాలు చేశారు. తమలపాకులు, మామిడి పండ్లతో స్వామివారిని అలంకరించి సహస్ర నామార్చనలు నిర్వహించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాల్లో సువర్చలాంజనేయ స్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నరసరావుపేటలో సత్తెనపల్లి రోడ్డులోని షిరిడీ సాయి బాబా మందిరంలో ఆంజనేయ స్వామివారిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వినుకొండలోని ప్రసిద్ధి గుంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి లీలావతి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శావల్యాపురం మండలంలోని కనమర్లపూడిలో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద తిరునాళ్ల వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. యడ్లపాడులోని శ్రీరణవీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కోళ్ళూరి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద సుమారు పది వేల మందికి అన్నదానం చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, సతీమణి లావణ్యతో కలసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



అన్న క్యాంటీన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జేసీ, ఎస్పీ

రూ.5 ఆహారం బాగుందా?

అన్న క్యాంటీన్ తనిఖీలో కలెక్టర్ ప్రశ్న

నాణ్యత.. వసతులను పరిశీలించిన జేసీ, ఎస్పీ

నరసరావుపేట కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): అన్నక్యాంటీన్‌లో రూ.5కి అందిస్తున్న ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయి.. రుచిగా ఉన్నాయా.? అని కలెక్టర్ అరుణ్‌బాబు ప్రశ్నించారు. నరసరావుపేట పల్నాడు రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను గురువారం కలెక్టర్ అరుణ్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో అందిస్తున్న పదార్థాలను ఆయన స్వయంగా తిని, రుచి చూశారు. ఆ సమయంలో అక్కడ తింటున్న వారిని కలెక్టర్ పదార్థాల నాణ్యత, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది టిఫిన్, భోజనం చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనూరే, ఆర్డీవో మధులత, మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, రెవెన్యూ అధికారి వేణుగోపాలరావు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



మెగా ఉద్యోగ మేళా గోడపత్రికలు విడుదల చేస్తున్న జీవీ ఆంజనేయులు, మక్కెన


వినుకొండలో 31న.. మెగా ఉద్యోగ మేళా

- జగన్ నిర్వాకంతో రాష్ట్రంలో పెరిగిన నిరుద్యోగం
- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం ఈ నెల 31న వినుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళా గోడపత్రికలను వినుకొండలోని ఆయన కార్యాలయంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ఈ మేళాలో 25 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చేసిన నిరుద్యోగులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9100566581, 7702921219 నంబర్లను సంప్రదించాలన్నారు.

వారు తరిమేశారు.. మేము తీసుకొస్తున్నాం

ఐదేళ్లు పరిశ్రమలను చావుదెబ్బ తీసి, ప్రభుత్వ ఉద్యోగాలను పేరపెట్టిన జగన్ నిరుద్యోగులను నరకయాతనకు గురి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలు, నిర్వాకంతో నిరుద్యోగుల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. కొత్తగా ఉద్యోగ అవకాశాలు ఇవ్వలేక పోగా అమర్‌రాజా, లులూ లాంటి పరిశ్రమలను తరిమికొట్టారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన మొదటి ప్రాధాన్యంగా తీసుకున్నామన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ అహర్నిశలు రాష్ట్రాభివృద్ధికి కష్టపడుతున్నారని, అనేక పరిశ్రమలను తీసుకువస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, జానీ, బత్తుల గోవిందరాజులు, టీఎన్ఎస్ఎఫ్ నర్రా కిశోర్, ప్రశాంత్ పాల్గొన్నారు.



జడ్పీలో.. జగడం

- చైర్‌పర్సన్ వర్సెస్ సీఈవో
- తారాస్థాయికి చేరిన విభేదాలు
- జ్యోతిబసు బదిలీకి హెనీక్రిస్టీనా పట్టు
- హెనీక్రిస్టీనాకు మద్దతుగా ముఖ్య నేతలు?

గుంటూరు సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, సీఈవో జ్యోతిబసుల మధ్య పొసగడం లేదు. ఈ క్రమంలో సీఈవో జ్యోతిబసు బదిలీకి ఛైర్‌పర్సన్ గట్టిగానే పట్టుపట్టినట్లు తెలుస్తుంది. అయితే సీఈవో బదిలీని అడ్డుకునే ప్రయత్నం కూడా బలంగానే కొనసాగుతుంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో 'వార్' పతాక స్థాయి చేరింది. ఛైర్‌పర్సన్ కోరినట్లుగా సీఈవోను బదిలీ చేయాలని ముఖ్య నేతలు రాష్ట్ర అధికారులకు చెప్పినట్లు తెలుస్తుంది. సీఈవో జ్యోతిబసు 2024 జూలైలో బదిలీపై రాగా వచ్చిన రోజు నుంచి ఛైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా చెప్పిన పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న వాదన ఉంది. కొన్నిసార్లు ఛైర్‌పర్సన్ ఇచ్చిన ప్రకటనలకు విరుద్ధంగా కూడా ప్రకటనలు చేశారు. ఈ క్రమంలో మధ్యలో ఒకటి రెండు సందర్భాల్లో కొందరు సయోధ్యకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. గతంలోనే సీఈవోను మార్చాలని ఛైర్‌పర్సన్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు లేఖ కూడా రాశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో సీఈవో బదిలీకి సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నట్లు తెలుస్తుంది.

అక్కడకు వెళ్తే అన్నీ పెండింగే..

జిల్లా పరిషత్‌లో సీఈవో దగ్గరకు వెళ్లిన ఏ ఫైల్ అయినా పెండింగ్‌లోనే ఉంటుందన్న ప్రచారం ఎక్కువగా ఉంది. జీతాల బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపినా 15 నెలల నుంచి కొంతమంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలను పెండింగ్ పెట్టారు. జీతాలు రాక ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మరణించారు. ఇలాంటి ఉదంతాలు చాలా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే సీఈవో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పనులు తాను చేయబోనని చెప్పినట్లు తెలుస్తుంది.

వైసీపీ నేతలకు జడ్పీ విషయాలు..

ఛైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అప్పటి నుంచి వైసీపీ నేతలు ఆమెకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. ఈ పరిస్థితిలో జడ్పీలో అత్యంత కీలకమైన సమాచారం వైసీపీ ముఖ్య నేతల దగ్గరకు వెళ్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు వైసీపీ నేతల ఇళ్లకు రికార్డులు కూడా తీసుకువెళ్లినట్లు ఆరోపణలున్నాయి. కొందరు అధికారులే కీలకమైన సమాచారం వైసీపీ నేతలకు చేరవేసి ఛైర్ పర్సన్‌కు వ్యతిరేకంగా విలేకర్ల సమావేశాలు పెట్టించినట్లు ప్రచారం జరిగింది. ఈ విషయాలను టీడీపీ ముఖ్య నేతల దృష్టికి ఛైర్‌పర్సన్ వర్గం తీసుకువెళ్లడంతోనే విషయం సీరియస్‌గా మారిందని సమాచారం.

ఉపాధ్యాయ బదిలీలు.. షురూ

- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ
- సంఘాల కార్యాలయాల్లోనూ సహకారం
- సాంకేతిక సమస్యలపై సంఘాల ఆందోళన
- ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్న గుంటూరు డీఈవో



బదిలీలు, పదోన్నతుల కోసం ఏపీటీఎఫ్ కార్యాలయంలోని కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు ప్రక్రియ గురువారం సజావుగా ప్రారంభమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్యాల ఆధ్వర్యంలో దాదాపు 13 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉండగా క్యాడర్ల వారీగా పలువురు బదిలీలకు, ఉద్యోగోన్నతులకు దరఖాస్తుకు సిద్ధమయ్యారు. ఈ నెల 21 నుంచి 22 వరకు ప్రధానోపాధ్యాయులకు, 21 నుంచి 24 వరకు స్కూల్ అసిస్టెంట్లకు, 21 నుంచి 27వ తేదీ వరకు ఎస్జీటీలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని విద్యాశాఖ కల్పించింది. దీంతో గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ వేగవంతమైంది. ఇందు కోసం విద్యాశాఖ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. విద్యాశాఖ కార్యాలయంలోని ఐటీ సెల్‌లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతికంగా వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాలు కూడా తమ కార్యాలయాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో బదిలీల ప్రక్రియ కోసం ఉపాధ్యాయులకు అవసరమైన సహాయ సహకారా లను అందిస్తున్నాయి. ఏపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్ కార్యాలయాల్లో దరఖాస్తులు అప్‌లోడులో తలెత్తే సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. దరఖాస్తుల అప్‌లోడు ప్రక్రియలో కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాలు వెల్లడిస్తు న్నాయి. ప్రధానంగా రెండు డీఎస్సీలలో ఎంపికైన ఉపాధ్యాయులకు సర్వీస్ రికార్డు సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక సర్వీస్‌ను మాత్రమే సాఫ్ట్‌వేర్ పరిగణనలోకి తీసుకుం టున్నట్లు చెబుతున్నారు. డేటాఫ్ జాయినింగ్ విషయంలో కొంత మందికి ఒక రోజు తక్కువగా చూపుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దరఖాస్తు చేసే వారిలో కొంతమందికి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ ఉంటే సాఫ్ట్‌వేర్‌లో మ్యాథ్స్‌గా చూపుతున్నట్లు చెబుతున్నారు. రీ అపోర్షన్మెంట్ పాయింట్స్ రావడంలేదని, రిక్వెస్ట్ బదిలీ వారికి కంపల్సరీ బదిలీ అని వస్తున్నట్లు పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆయా సాంకేతిక సమస్యలను ఎ ప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని గుంటూరు డీఈవో రేణుక స్పష్టం చేశారు.

అబద్ధాలకు అలవాటుపడ్డ జగన్‌రెడ్డి

● ప్రజలు బుద్ధి చెప్పినా మారని వైనం
● రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్


మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 22(ఆంధ్రజ్యోతి): అబద్ధాలకు అలవాటుపడ్డ జగన్‌రెడ్డి నాలుక ఎటుతిప్పినా అబద్ధాలనే మాట్లాడతాడని రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. గురువారం జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన ప్రెస్‌మీట్‌కు మంత్రి అనగాని స్పందించారు. ప్రజలు బుద్ధి చెప్పినప్పటికి ఇంకా ఫేక్ బతుకు నుంచి మాత్రం జగన్ బయటకు రాలేకపోతున్నారన్నారు. అప్పుల నుంచి విద్యుత్ కొనుగోలు వరకు అన్నింటిపైనే అబద్ధాలే చెప్పుకుంటూ ప్రజలను మోసం చెయ్యటానికి సిద్ధమయ్యారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా అప్పులు చేసి స్కీమ్‌ల పేరుతో కోట్లరూపాయలు స్కామ్‌లు చేసిన చరిత్ర జగన్‌రెడ్డిదేనన్నారు. అప్పుతెచ్చిన ప్రతి రూపాయిని సంక్షేమంతోపాటు అభివృద్ధికోసం ఖర్చుచేస్తున్నది కూటమి ప్రభుత్వం అన్నారు. యాక్సెస్ ఎనర్జీతో యూనిట్‌కు రూ.5.12చొప్పున ఒప్పందంచేసుకున్న జగన్‌రెడ్డి రూ.2.10కే ఒప్పందం చేసుకున్నట్లు నంగనాచిలా అబద్ధాలు చెబుతున్నారన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంతో పోలిస్తే చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో రెవెన్యూ రాబడి 4.74 శాతం పెరిగిందని, కానీ జగన్‌రెడ్డి మాత్రం అంకెలగారడీ చేస్తున్నారన్నారు. అమరావతి రాజధానిపై ఇచ్చిన మాట తప్పి ప్రజలతో ఛీకొట్టించుకున్నా బుద్ధిరాని జగన్ ఇంకా విషప్రచారం చేద్దామని కుటిల రాజకీయాలు చేస్తున్నారన్నారు.

యోగాంధ్ర ఏర్పాట్ల పరిశీలన


యోగాంధ్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు

నరసరావుపేట కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పరిశీలించారు. వచ్చే నెల 21 వరకు కలెక్టర్ బంగ్లా నుండి పల్నాడు బస్టాండ్ వరకు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్న నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. శిక్షణ నేపథ్యంలో వాహనాలను దారి మళ్లించాలని సూచించారు. యోగాలో పాల్గొనే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఆర్డీవో మధులత తదితర అధికారులు పాల్గొన్నారు.

వర్సిటీలో నకిలీ చలానాల కలకలం

పెదకాకాని, మే 22(ఆంధ్రజ్యోతి): నాగార్జున విశ్వవిద్యాలయంలో సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కట్టిన ఫీజు సొమ్మును ఓ ఉద్యోగి కాజేసి అధికారులను బురిడీ కొట్టించాడు. విద్యార్థులు తమకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం ఫీజు చెల్లించాల్సి వుంటుంది. అయితే ఆ ఉద్యోగి విద్యార్థుల వద్ద ఫీజు వసూలు చేసి ఆ మొత్తాన్ని బ్యాంకులో జమ చేయకుండా నకిలీ చలానాలు పెట్టి విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేసినట్టు తెలిసింది. విద్యార్థుల వద్ద వసూలు చేసిన మొత్తం పది లక్షల రూపాయలకు పైగానే వుంటుందని అంచనా వేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆఫీసులో జరిగిన ఈ వ్యవహారాన్ని గోప్యంగా వుంచారు. దీంతో ఈ దొంగ చలానాల వ్యవహారం కొంత మంది అధికారుల కనుసన్నల్లో జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమగ్ర విచారణ చేస్తే ఆ ఉద్యోగి, అధికారుల అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చే అవకాశం వుందని పలువురు విద్యార్థులు, తోటి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

సొంతూరిపై మమకారం అభినందనీయం

● ఎడ్ల బలప్రదర్శన పోటీల ముగింపు సభలో ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, నసీర్ అహ్మద్


మాట్లాడుతున్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్


3వ రోజు ఎడ్ల బలప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

పీసీపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గుంటూరులో స్థిరపడినప్పటికీ సొంతూరిపై మమకారంతో అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో పాటు పల్లె సంస్కృతిని అద్దం పట్టేలా ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్న కొంపల్లి మాలకొండయ్య అభినందనీయులని కనిగిరి, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, నసీర్ అహ్మద్‌లు అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని వెంగళాపురం సమీపంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు గురువారం ముగిశాయి. నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముగింపు రోజు జరిగిన ఎడ్ల బలప్రదర్శన పోటీలో వీరు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎడ్లు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాయన్నారు. గతంలో ప్రతి ఊరిలో ప్రతి ఇంటికి ఒక కాడె ఎడ్లు ఉండేవన్నారు. ప్రస్తుతం యాంత్రీకరణ పద్ధతిలో వ్యవసాయం చేస్తుండడంతో ఏటేటికీ గ్రామాల్లో ఎడ్ల సంఖ్య తగ్గిపోతుందన్నారు. ఈతరుణంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలకు వచ్చిన ఎడ్లను చూస్తుంటే సంతోషంగా ఉందని వారన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఈ ప్రాంతం వారు ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోకుండా ఉండేందుకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌ను ఇక్కడికి తీసుకురావడంతో పాటు ఎంఎస్ఎంఈ పార్కులను కూడా మంజూరు చేయించారన్నారు. నిరంతరం కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి ప్రజలందరూ అండగా ఉండాలని ఆయన కోరారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సూచన మేరకు త్వరలో కనిగిరిలో స్టేడియంను నిర్మించబోతున్నట్టు చెప్పారు.

గురువారం నిర్వహించిన సీనియర్ పోటీల విభాగంలో నంద్యాల జిల్లా హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఎమ్.రామసుబ్బారెడ్డికి చెందిన ఎడ్లు 3103.2మీటర్లు బండ లాగి ప్రథమస్థానంలో విజేతగా నిలిచాయి. నంద్యాలజిల్లా జిల్లెల గ్రామానికి చెందిన దినేష్‌రెడ్డి, హిత్విక్‌రెడ్డి ఎడ్లు 3017.3మీటర్లు బండలాగి ద్వితీయస్థానం, బాపట్లజిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోటి వీరీషచౌదరి, శివక్రిష్ణ చౌదరిల ఎడ్లు 3000మీటర్లు లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. వీటితో పాటు 7వ స్థానం వరకు విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కొంపల్లి మల్లికార్జున, మధు, వెల్ది కొండయ్య, గుదే నాగేశ్వరరావు, రావి రామాంజనేయులు, వడ్డెంపూడి చిన్నా, వడ్డెంపూడి శ్రీను, రామారావు, సుబ్బారావు, పెద రాఘవయ్య, సోమయ్య, సతీష్, రాజా తదితరులు పాల్గొన్నారు.


చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

వ్యాపార, వాణిజ్యవర్గాలకు అండగా కూటమి ప్రభుత్వం


● ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో వాణిజ్య, వ్యాపార వర్గాలవారు ఎలాంటి ఆందోళన, భయం లేకుండా ప్రశాంతంగా తమ కార్యకలాపాలు సాగించుకోవచ్చునని, గతంలో మాదిరి వేధింపులు, దౌర్జన్యాలు, బెదిరింపులకు స్థానం లేదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో గురువారం చిలకలూరిపేట నియోజకవర్గ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వ్యాపారులకు అన్నివిధాల తోడ్పాటునందిస్తామని తెలిపారు. వ్యాపారులు తమ సంపాదనలో కొంత భాగాన్ని ప్రజాసేవకు వెచ్చించాలని, వివిధ మార్గాల్లో పదిమందికి సాయపడేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు, గుంటూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, కందుల రమణ, వెల్లంపల్లి రవిశంకర్, కనమర్లపూడి రమేష్ పాల్గొన్నారు.

భూకేటాయింపునకు
సీఎస్‌కు ఏపీ గ్రామీణ బ్యాంకు చైర్మన్ విజ్ఞప్తి

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటుచేసేందుకు అమరావతిలో భూమి కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్‌కు ఆ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని కార్యాలయంలో సీఎస్ విజయానంద్‌ను బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి గురువారం కలిశారు. అమరావతిలో ఏపీ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు భూకేటాయింపు చేయాలని వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫైనాన్సియల్ ఇంక్లూషన్, గ్రామీణాభివృద్ధిని విస్తరించాలన్న బ్యాంకు దృష్టిని సీఎస్‌కు వివరించినట్లు తెలిపారు. రాజధాని ప్రాంతంలో శాశ్వత ప్రధాన కార్యాలయాన్ని స్థాపించటం ద్వారా బ్యాంకు పరిపాలనా సామర్థ్యాలు బలపడతాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామీణ ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. దీనిపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సమావేశంలో చైర్మన్‌తో పాటు బ్యాంకు జనరల్ మేనేజర్ హరీష్ బేతా తదితరులున్నారు.

సాగర్ కుడి కాలువకు తాగునీరు విడుదల


సాగర్ కుడి కాలువకు విడుదలవుతున్న తాగునీరు

మాచర్లటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువకు గురువారం అధికారులు తాగునీటిని విడుదల చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు ఆదేశాలతో సాగర్ కుడి కాలువ ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున మొత్తం 4 టీఎంసీల నీటిని అధికారులు విడుదల చేయనున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 22(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 512.60 అడుగులు ఉంది. ఇది 136.12 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 4459 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 450, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 4909 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

రెండు రైళ్ల రద్దు... కొన్ని దారి మళ్లింపు

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్‌లోని మహబూబాబాద్ వద్ద ప్రీఎన్ఐ/ఎన్ఐ పనుల కారణంగా పలు రైళ్లు రద్దు అయ్యాయి. నంబరు 12706/12705 సికింద్రాబాద్-గుంటూరు-సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు పూర్తిగా రద్దు చేశారు. నంబరు 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని 28వ తేదీ వరకు కాజీపేట వరకే నడుపుతారు. నంబరు 17201 గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు నడుపుతారు. నంబరు 18519/18520 విశాఖపట్టణం - ఎల్‌టీటీ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 28వ తేదీ వరకు విజయవాడ నుంచి గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ మీదగా సికింద్రాబాద్‌కు దారి మళ్లించి నడుపుతారు. ఇదేవిధంగా నంబరు 12522 ఎర్నాకుళం - బౌరాని రఫ్తీసాగర్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 23వ తేదీన తెనాలి, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్ మీదగా దారి మళిస్తారు.

గొర్రెల కాపరి అనుమానాస్పద మృతి

● మృతదేహంపై పలు గాయాలు ● పుసులూరు గ్రామ శివారులో ఘటన


తలపల శివయ్య ఫైల్‌ఫోటో

పెదనందిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పుసులూరు గ్రామ శివారులో గొర్రెల కాపరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. పుసులూరు గ్రామానికి చెందిన తలపల శ్రీనివాసరావు (42) ఎప్పటిలాగానే బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని పొలాల్లోకి గొర్రెల మందను తోలుకొని వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా ఫోన్‌స్విచ్ఛాఫ్ రావడంతో, పొలానికి వెళ్లి వెతకగా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం పుసులూరు - వల్లూరు వెళ్లే రహదారిలో పొలాల్లో మృతదేహాన్ని అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా శ్రీనివాసరావు మృతదేహంగా గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ భానోదయ, సీఐ శ్రీనివాసరావు, సీఎస్ డీఎస్పీ శివాజీ, ఎస్ఐలు మధుపవన్, ఏక్‌నాథ్‌లు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా శరీరంపై పలు గాయాలు ఉన్నట్లు గుర్తించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. భార్య చెంచుకుమారి ఫిర్యాదు మేరకు కాకుమాను పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏకనాథ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

బంగారం షాపులో చోరీపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, మే 22(ఆంధ్రజ్యోతి): బంగారం షాపులో ఉద్యోగిగా చేరి నగలు చోరీ చేశాడంటు యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గురువారం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గంగానమ్మపేటకు చెందిన బన్సారి రమేష్‌కుమార్ ముత్తా ఎంఎం జ్యూయలర్స్ షాపులో మేనేజింగ్ పార్టనర్. ఇదే షాపులో అదే ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ జైన్ చౌదరి స్టోర్, స్టాక్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 14న షాపు నుండి ఇంటికని వెళ్లి తిరిగిరాలేదు. అనిల్‌కుమార్ జైన్ కుటుంబ సభ్యులను విచారించగా ఎక్కడికి వెళ్లింది తెలియదని అతని సెల్‌ఫోన్ కూడా ఇంటిలోనే పెట్టి వెళ్లాడని తెలిపారు. అతని ప్రవర్తనపై అనుమానంతో షాపులోని సీసీ కెమెరాలను పరిశీలించి స్టాక్ తనిఖీ చేయగా సుమారు కేజి 509గ్రాముల బంగారం చోరీకి గురైందని, వాటి విలువ సుమారు రూ.కోటి 45లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితుడు రమేష్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య హత్య కేసులో
భర్తకు జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కాగే నూనెను భార్యపై పోసి హతమార్చినట్లు నేరం రుజువ వడంతో నిందితుడు పల్నాడు జిల్లా పిడుగురాళ్లకి చెందిన బొగ్గవరపు నాగరాజుకు జీవిత ఖైదు, రూ.20వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు న్యాయాధికారి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నిందతుడు నాగరాజుకు 14 సంవత్సరాల క్రితం మేరీతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. అనంతరం భార్యాభర్తల మధ్యస్పర్థలు తలెత్త డంతో మేరీ ఈపూరు మండలం కూచినపల్లిలో తన పుట్టింటికి వెళ్ళింది. 2023 ఏప్రిల్ 9న సాయంత్రం ఆ గ్రామంలో తిరుణాళ్ల జరుగుతుండడంతో మేరీ కుటుంబసభ్యులు వంటకాలు చేస్తున్నారు. అక్కడికి వచ్చిన నాగరాజు, మేరీతో ఘర్షణకు దిగి కోపంతో పొయ్యిపై కాలుతున్న నూనెను ఆమెపై పోశాడు. తీవ్రగాయాలపాలైన ఆమెను చికిత్స నిమిత్తం గుంటూరు సమగ్ర ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ న్యాయ అధికారికి మరణ వాంగ్మూలం ఇచ్చారు. తదుపరి చికిత్సపొందుతూ మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదుచేసిన ఈపూరు పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో ప్రవేశపెట్టారు విచారణలో నేరం రుజువవడంతో వరకట్నం కేసులో మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా, హత్యకేసులో జీవితఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ, శిక్ష మొత్తం ఏకకాలంలో అనుభవించేలా కోర్టు తీర్పుచెప్పింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేసిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు.

27న బర్లీ పొగాకు రైతుల దీక్షలు

చిలకలూరిపేట, మే 22(ఆంధ్రజ్యోతి): ఐటీసీ కంపెనీతోపాటు అన్ని కంపెనీలు రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చెయ్యాలని డిమాండ్ చేస్తూ అన్ని రైతు సంఘాల నాయకుల నిర్ణయం మేరకు పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న ఐటీసీ కంపెనీ వద్ద ఈ నెల 27వ తేదీన పొగాకు రైతుల నిరసన దీక్ష చేపడుతున్నట్లు నల్లమడ రైతుసంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు గురువారం తెలిపారు. వ్యవసాయ శాఖ దగ్గర ముందస్తు ప్రణాళిక లేకపోవడం వలన ఎక్కువమంది రైతులు బర్లీ పొగాకును సాగుచేసి నష్టపో యారని, గత్యంతరం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కంపెనీలన్నీ సిండికేట్ అయ్యి బర్లీ పొగాకును తక్కువరేట్లకు మధ్యవర్తుల ద్వారా కొనుగోలు చేసి, పొగాకు రైతులను పెద్ద కంపెనీలు దెబ్బ తీస్తున్నా యన్నారు. కంపెనీల మాటలను నమ్మి పలువురు రైతులు ముఖ్యంగా కౌలు రైతులు అప్పుచేసి భారీగా బర్లీ పొగాకు సాగు చేసి, పంటచేతికి వచ్చాక కొనుగోలు చేసేవారు లేక తీవ్రంగా ఆందోళన పడుతున్నారని చెప్పారు. బర్లీ పొగాకును కేంద్ర ప్రభుత్వం వెంటనే పొగాకు బోర్డు పరిధిలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

24 నుంచి తృతీయ జాతీయ స్థాయి నాటికల పోటీలు

నాదెండ్ల, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామంలో ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు తృతీయ జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్టు నటరత్న ఎన్‌టీఆర్ కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి నడింపల్లి వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. గ్రామంలోని భారతీ కళా వేదిక పై 24వ తేదీన కళాభినయ విశాఖపట్నం వారి ఓ కాశీ వాస రావయ్య, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి మరీ అంతొద్దు, 25న శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు, భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం వారి దొందూ దొందే, హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఏలూరి వారి సారి రాంగ్ నెంబరు, 26న సహృదయ ద్రోణాదుల బాపట్ల వారి వర్క్ ఫ్రమ్ హోమ్, వజ్జా రామనాథం ఆర్ట్స్ సాతులూరి వారి రారాజు సుయోధన పౌరాణిక నాటిక, జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక వరంగల్ వారి ఏకాకి, 27న గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, న్యూఢిల్లీ వారి అనస్వరం, మద్దుకూరి ఆర్ట్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహా భారతం, 28న అరవిందో ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి, అద్దెపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్ తెనాలి వారి ఎవరు, ఉషోదయ కళానికేతన్ కాట్రపాడు వారి కిడ్నాప్ నాటికల ప్రదర్శనలు జరుగుతాయని ఆయన వివరించారు.


బుద్ధిస్ట్ డెవలప్‌మెంట్ సర్క్యూట్‌లో భట్టిప్రోలుకు స్థానం

● బుద్ధిస్ట్ సొసైటీ కార్యదర్శి రమేష్ రాంజీ డిమాండ్


మాట్లాడుతున్న బుద్ధిస్ట్ సొసైటీ కార్యదర్శి రమేష్ రాంజీ

భట్టిప్రోలు(కొల్లూరు), మే 22(ఆంధ్రజ్యోతి): అమరావతి బుద్ధిస్ట్ డెవలప్‌మెంట్ సర్క్యూట్‌లో భట్టిప్రోలు బౌద్ధ క్షేత్రానికి స్థానం కల్పించాలని ఆది ఆంధ్ర నవబుద్ధిస్ట్ సొసైటీ కార్యదర్శి రమేష్ రాంజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భట్టిప్రోలులో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ 2024-29 పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బౌద్ధ క్షేత్రాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అమరావతి, విశాఖపట్నం కేంద్రాలుగా బుద్ధిస్ట్ డెవలప్‌మెంట్ సర్క్యూట్స్ వాటికి ప్రాచుర్యం కల్పించేందుకు కమిటీలు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అమరావతి సర్క్యూట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అమరావతి, గుంటుపల్లి, ఉండవల్లి, నాగార్జునకొండ, కృష్ణాజిల్లాలోని ఘంటసాలను పర్యాటక శాఖ అభివృద్ధి ప్రదేశాలుగా ఉత్తర్వులో పేర్కొన్నారన్నారు. కానీ భట్టిప్రోలు బౌద్ధక్షేత్రాన్ని విస్మరించడం శోచనీయమన్నారు. కలెక్టర్ వెంకటమురళీ, జిల్లా పర్యాటక శాఖాధికారి నాగిరెడ్డి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చొరవ తీసుకుని భట్టిప్రోలు బౌద్ధ క్షేత్రాన్ని అమరావతి బుద్ధిస్ట్ డెవలప్‌మెంట్ సర్క్యూట్‌లో పొందుపరిచి అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. సమావేశంలో సభ్యులు కర్రా బాబురావు, తురుమెళ్ల శ్యామ్, వెంకట్రావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి


అంకమ్మ ఫైల్‌ఫోటో

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే 22 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని గొడవర్రులో చోటుచేసుకుంది. చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గొడవర్రు గ్రామానికి చెందిన పల్లా అంకమ్మ (55) గొర్రెల కాపరిగా రాత్రి సమయంలో మందలను కాపలాకాస్తుంటాడు. రోజు మాదిరిగానే కాపలాకాసేందుకు బుధవారం పంటపొలాలకు వెళ్లాడు. తెల్లవారినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతడికోసం పరిసర ప్రాంతాల వారిని విచారించారు. అతను కాపలాకు వెళ్లిన పొలాల్లో గురువారం మృతి చెంది ఉన్నాడు. పిడుగు పాటుకు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి వివాహమై భార్య మృతి చెందగా ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటకృష్ణ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

మహానాడులో డాక్టర్ శ్రీనివాస్‌కు వైద్యశిబిరం బాధ్యత

గురజాలటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు చల్లగుండ్ల శ్రీనివాస్ కడపలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న టీడీపీ మహానాడు - 2025లో రక్తదాన, వైద్యశిబిరం కమిటీలో బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మకర్తల మండలి నియామకానికి 9 దరఖాస్తులు : ఈవో

రెంటచింతల, మే 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి గురువారం వరకు 9 దరఖాస్తులొచ్చినట్లు ఈవో గాదే రామిరెడ్డి చెప్పారు. ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. 50 శాతం ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు కేటాయిస్తారని అలాగే బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు స్థానం కేటాయిస్తారన్నారు. ప్రధాన అర్చకుడు ఎక్స్ ఆఫీషియో(పదవి రీత్యా హోదా) సభ్యుడిగా ఉంటారన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

క్రోసూరు, మే 22(ఆంధ్రజ్యోతి): పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. క్రోసూరులోని సినిమా హాల్ సెంటర్లో ఎస్ఐ రవిబాబు ఆధ్వర్యంలో పోలీసులు వచ్చే పోయే వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు లోబడి వాహనదారులు రాకపోకలు సాగించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పెద్ద వాహనాలు నడిపే వారు సీట్లు బెల్టు ధరించాలని ఎస్ఐ సూచించారు. సరైన పత్రాలు లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వారిని హెచ్చరించారు.

● సత్తెనపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అచ్చంపేట రోడ్డు మార్గంలో పోలీసులు, రవాణా శాఖ, ఆర్టీసీ అధికారులు గురువారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. అధిక లోడుతో వెళ్తున్న ఆటోలను నిలుపుదల చేసి వాహనాల పత్రాలను, డ్రైవర్ల లైసెన్స్‌లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా 15 వాహనాలను సీజ్ చేసి రూ 42వేలు అపరాధ రుసుం విధించారు.

అసిస్టెంట్ పోస్టుమాస్టర్ సాధిక్ మృతి

పెదకూరపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాపురం అసిస్టెంట్ పోస్టు మాస్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న చావపాటి మస్తాన్ సాధిక్(28) మృతి చెందినట్టు ఎస్ఐ గిరిబాబు గురువారం తెలిపారు. గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న నీటి కుంటలో ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడని మృతుని బంధువులు పోలీసులకు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు పంపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గ్రీవెన్స్‌లో సమస్యల పరిష్కార దిశగా అధికారులు

పిడుగురాళ్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ పరిధిలో ఈ నెల 15వ తేదీన పిడుగురాళ్లలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచనల మేరకు ప్రతి లబ్ధిదారుడు కార్యాలయాలకు రాకుండా నేరుగా గ్రామాలకు వెళ్లి పరిష్కరించే విధంగా చూస్తున్నామని తహసీల్దార్ మధుబాబు తెలిపారు. గ్రామస్థాయి నుంచి భూసమస్యలు, ఇంటి నివేశ స్థలాల సమస్యల పరిష్కారానికి పిడుగురాళ్ల రెవెన్యూ అధికారులు రైతులను, లబ్ధిదారులను కార్యాలయాలకు పిలిపించకుండా వారే నేరుగా గ్రామాలకు చేరుకొని ఆయా సమస్యల పూర్తి వివరాలను తెలుసుకోవడంతో పాటు కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించే దిశగా గురువారం పిడుగురాళ్ల తహసీల్దార్ మధుబాబు, డీటీ శర్మ, అన్ని గ్రామాల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించారు. గుత్తికొండ సచివాలయంలో తహసీల్దార్ గ్రామస్థులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.

టీడీపీపై తప్పుడు ప్రచారాలు వైఎస్‌జగన్‌కు తగదు

● వక్కంటి అజయ్‌కుమార్

సత్తెనపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలు ఛీదరించుకున్నారని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి వక్కంటి అజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఛీ కొట్టినా మరోసారి మీడియా సాక్షిగా తప్పుడు ప్రచారాలు చేయటం వైఎస్ జగన్‌కు తగదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై పదేపదే విమర్శలు చేస్తే సహించేదే లేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దోపిడీలు, అవినీతిపై సాక్ష్యాధారాలతో సహా నిరూపించి జగన్‌ను జైలుకు పంపటం ఖాయమన్నారు.

భూకబ్జా రాయుళ్లతో జైలు ఊచలు లెక్క పెట్టించాలి

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాశయ్య

క్రోసూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో కోట్లాది రూపాయల విలువ చేసే భూకబ్జాలకు, కుంభకోణాలకు పాల్పడ్డ వారితో జైలు ఊచలు లెక్క పెట్టించాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సలహాదారుడు పేరుతో సకలశాఖ మంత్రిగా పని చేసిన సజ్జల రామకృష్ణారెడ్డిని, చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే అటవీ భూములను, పేద ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేసిన భూములను పెత్తందారులైన సజ్జల, పెద్దిరెడ్డి కబ్జాలు చేయటం శోచనీయం అన్నారు. ఆయనతో పాటు జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దుద్దుల యోహాన్ కూడా ఉన్నారు.

ఉరుములతో కూడిన భారీ వర్షం

● లోతట్టు ప్రాంతాలు జలమయం
● రోడ్లపైకి చేరిన మురుగునీరు



మురుగుకాల్వను శుభ్రం చేయిస్తున్న కమిషనర్ శివన్నారాయణ



మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

గురజాలటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలో బుధవారం అర్ధరాత్రి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని లక్ష్మీటాకీస్ సెంటర్లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఎదురుగా మాచర్ల - గుంటూరు రహదారిపై రాత్రి కురిసిన వర్షానికి భారీగా రోడ్డుపైకి వర్షపు నీరు చేరి కుంటలుగా ఏర్పడ్డాయి. అలాగే పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం భారీ వర్షానికి డ్రైనేజీ నిండిపోయి మురుగు నీరంతా రోడ్డు మీద పారింది. దీంతో ఆ ప్రదేశమంతా దుర్వాసన వస్తోంది. అలాగే పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

గత వైసీపీ పాలనలో గురజాల పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్థవ్యస్థంగా మారింది. డ్రైనేజీని పట్టించుకునే వారే కరువయ్యారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. ఐదేళ్లలో డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయక పోవడంతో గురువారం డ్రైనేజీ అంతా ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి కొద్దిపాటి వర్షానికి వర్షపునీరు రోడ్డుపై భారీగా చేరింది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● కమిషనర్ శివన్నారాయణ

రానున్న వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గురజాల కమిషనర్ శివన్నారాయన కోరారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వర్షపునీరు భారీగా రోడ్డుపై చేరడంతో గురజాల కమిషనర్ శివన్నారాయణ గురువారం తెల్లవారుజామున ఎక్కడైతే డ్రైనేజీ వ్యవస్థ బాగలేదో అక్కడకు చేరుకొని మున్సిపల్ సిబ్బందితో డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరిచారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రపరుచుకొని చెత్తాచెదారం ఉంటే రోడ్లపై వేయకుండా ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బంది అందించాలన్నారు.

● రెంటచింతల, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం వేకువజామునుంచి భారీ వర్షం కురిసింది.దీంతో పలు వీధుల్లోని గృహాలు నీట మునిగాయి. 46.2 మి.మి వర్షపాతం నమోదైనట్లు జంగమహేశ్వరపురం వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

బెల్లంకొండ, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. గురువారం రాత్రి స్వామి జయంతి సందర్భంగా మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద కొళ్ళూరి ప్రసన్నాంజనేయ స్వామి జయంతి వేడుకల్లో సతీమణి లావణ్యతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో ఆలయాన్ని అభివృద్ధి చేయటం అభినందనీయమన్నారు. ఈ సంవత్సరం ప్రసన్నాంజనేయ స్వామి వారి జయంతి వేడుకలు ఐదు రోజులు జరుపుకోవటం శుభ పరిణామమని తెలిపారు. అనంతరం ఆలయంలో దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే ప్రవీణ్‌కు దేవదాయ శాఖ ఈవో వెంకటేశ్వరరెడ్డి, వేద పండితులు డప్పు వాయిద్యాలతో ఆలయంలోకి తీసుకువెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ నాయకులు పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ ఇన్ చార్జ్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండ య్య, అక్కల వెంకట రామి రెడ్డి, సర్పంచ్ జ్యోతి సము ద్రం, గంగిరెడ్డిపాలెం సర్పంచ్ జగన్, మేళం శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుండవరం ఆంజనేయ స్వామి పూజల్లో ..

పెదకూరపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు గ్రామ పొలిమేరలో ఉన్న గుండవరం ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి పండితులు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. వచ్చినటువంటి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గుండవరం ఆంజనేయ స్వామి ప్రసిద్ధి చెందటంతో కంభంపాడు, ఉంగుటూరు, ఏనికపాడు, నెమలికల్లు, 14వ మైలు, మండెపూడి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమరావతి మండలంలోని లేమల్లెలో జరిగిన హనుమాన్ జయంతిలో కూడా ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తంగెడలో దాడులు చేసిన హరికృష్ణకి వైసీపీ అండ

దాచేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి) : తంగెడలో పెట్రోల్ బాంబులు వేసి గ్రామంలో గొడవలు చేసిన వ్యక్తికి వైసీపీ అండగా ఉంటుందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. గురువారం నేతలు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అండదండలతో తంగెడలో 2024లో జరిగిన ఎన్నికల్లో పెట్రోల్ బాంబులు తయారు చేసి బాంబులు వేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన వ్యక్తి ఉప్పుతోళ్ళ హరికృష్ణ అని ఆరోపించారు. బతుకుదెరువు కోసం సైకిల్ షాపు పెట్టుకొని జీవనం గడుపుతున్న దివ్యాంగుల షాపులను పెట్రోల్ బాంబులతో ధ్వంసం చేశారు. పది బైక్‌లు, నాలుగు షాపులను తగల బెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఓటింగ్ కోసం వచ్చిన అమాయక ప్రజలపై, ఈవీఎంలపై బాంబులు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా కూటమి ప్రభుత్వాన్ని దూషిస్తూ పార్టీ కార్యకర్తలను బెదిరించటం అలవాటైంది. బుధవారం సాయంత్రం తంగెడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలపై కత్తి తీసుకొని దాడి దిగాడు. బాధితులు భయాందోళనలకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఉప్పుతోళ్ళ హరికృష్ణపై రౌడీ షీటు ఉంది. ఇటువంటి వ్యక్తుల కోసం వైసీపీ నేతలు అడ్డుపడటం నీచమైన చర్యగా టీడీపీ నేతలు ఆరోపించారు. వైసీపీ చేసిన నీచ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

హరికృష్ణను చూపాలంటూ ఆందోళన

దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఉప్పుతోళ్ళ హరికృష్ణను పోలీసులు స్టేషన్‌కు తీసుకురావటంతో హరికృష్ణను చూపాలంటూ కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆందోళన చేశారు. గురువారం తంగెడ గ్రామానికి చెందిన హరికృష్ణపై ఉన్న ఫిర్యాదుతో పోలీసులు దాచేపల్లి పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. తమ కుమారుడిని అన్యాయంగా పోలీసు స్టేషన్‌కు తరలించారని నిందితుడి తల్లిదండ్రులు, బంధువులు, తంగెడకి చెందిన వైసీపీ నాయకులు స్టేషన్‌కు చేరుకున్నారు. గుంపులుగా రావటంతో పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. వైసీపీ నాయకులు తమ కార్యకర్తను ఎటువంటి ఫిర్యాదు లేకుండా తీసుకు రావటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఉండటంతో గురజాల, పిడుగురాళ్ళ, మాచవరంనకు చెందిన సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ నిందితుడిని విచారిస్తున్నామని తెలిపారు.

హత్యాయత్నం కేసులో హరికృష్ణ అరెస్టు

తంగెడ గ్రామానికి చెందిన హరికృష్ణపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపెట్టారు. గురువారం దాచేపల్లి పోలీసులు తంగెడ గ్రామానికి చెందిన హరికృష్ణ అదే గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్‌పై కర్రలతో దాడి చేశాడని తెలిపారు. ఈ ఘటనలో నిందితుడిగా ఉన్న హరికృష్ణపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పాపా రావు తెలిపారు.

లైగింక వేధింపుల చట్టంతో మహిళలకు రక్షణ

● న్యాయాధికారి ప్రశాంత్

మాచర్లటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పని చేసే ప్రాంతాల్లో వేధింపులకు గురయ్యే మహిళలకు లైంగిక వేధింపుల చట్టం 2013 రక్షణ కల్పిస్తుందని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్ అన్నారు. పట్టణంలోని కోర్టు హాల్లో గురువారం మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యాన ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లకు లైంగిక వేధింపుల చట్టం 2013పై న్యాయాధికారి ప్రశాంత్ అవగాహన కల్పించారు. మహిళలు వేధింపులకు గురైనట్లయితే సంబంధిత శాఖాధిపతులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, అధ్యక్షుడు రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు గౌస్ బాషా, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 22.21 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమత్ జయంతి వేడుకలు



పిడుగురాళ్ల అభయ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పాల్గొన్న యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఉన్న శ్రీఅభయ ప్రసన్నాంజనేయ స్వామిని మల్లెలతో ప్రత్యేక అలంకరించి అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే యరపతినేని తనయుడు సాయినిఖిల్, కూటమి నేతలు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, మేకల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తినగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో, కట్టెల అడితిల సెంటర్‌లో వున్న బ్రహ్మంగారి దేవాలయంలో ఘనంగా నిర్వహించా రు.

● మాచవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం శ్రీరాముని వీరభక్తుడు హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాచవరం, వేమవరం, చెన్నాయపాలెం, మోర్జంపాడు, ఆకురాజుపల్లి ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అభిషేకాలు చేశారు. చెన్నాయపాలెంలో గ్రామ పురోహితులు జానపాటి సీతారామ శర్మ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు

కారంపూడి మండలంలో..

కారంపూడి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో హనుమజ్జయంతిని గ్రామగ్రామాన వైభవంగా నిర్వహించారు. ప్రాచీనకాలం నాటి మిట్టమీద ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. మహిళలు హనుమాన్ చాలీసా నిర్వహించారు.

● గురజాలటౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంగం డెయిరీ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు కోలాటం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పుర వీధుల్లో ఊరేగించారు.

● రెంటచింతల (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. పలువురు దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. గురు చంద్రశేఖర శర్మ, కృష్ణమాచార్యుల నేతృత్వంలో స్వామికి అభిషేకం, ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. పురవీధుల్లో స్వామి వార్ల శోభాయాత్రను చేపట్టారు. ఆలయ చైర్మన్ గుండా రామ్మూర్తి, ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి నేతృత్వంలో వందలాది మందికి అన్నదానం చేశారు.

● దుర్గి(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అన్నసంతర్పణ గావించారు.

పెదకూరపాడులో..

పెదకూరపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులో ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు నిర్వాహకులు తొర్లకుంట శ్రీనివాసరావు, రావి శ్రీకాంత్, మంచి నీళ్ళ శ్రీధర్, శాఖమూరి శ్రీనివాసరావు, ఉన్నవ మోహన్‌రావుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


● క్రోసూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో పురాతన సిద్ధిపాలెం ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పశువుల ఆస్పత్రి వద్ద ఉన్న భారీ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద, నరసింహ స్వామి దేవాలయం వద్ద, గాంధీ చౌక్ వద్ద పురాతన ఆంజనేయ స్వామి దేవాలయంలోను హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

● అమరావతి (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలపరిధిలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదం పంపిణీ చేశారు. అమరావతి, దిడుగు, లింగాపురం, ఎండ్రాయి, లేమల్లె, వైకుంఠపురం, అత్తలూరు గ్రామాల్లోని అభయాంజనేయ స్వామి, మల్లాదిలోని ధ్యానాంజయనేయ స్వామికి ప్రత్యేక పూజలు, లక్ష తమల పాకు అర్చన, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఎండ్రాయిలో మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు పూజల్లో పాల్గొన్నారు.

● అచ్చంపేట (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటతో పాటు పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అచ్చంపేటలోని ఆంజనేయుని విగ్రహం వద్ద వందలాది మంది భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని చెరుకుంపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

● నకరికల్లు, (ఆంధ్రజ్యోతి): కుంకలగుంటలోని భద్ర కాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయంలో ఉన్న ఆంజనేయ స్వామికి, వేణుగోపాల స్వామి దేవాలయంలో, వెంకటేశ్వర స్వామి దేవాలయం ముందు ఉన్న ఆంజనేయస్వామికి, బ్రహ్మం గారి గుడి ముందు ఉన్న ఆంజనేయ స్వామికి, కాశీరత్నం దేవాలయంలోని వీరాంజనేయ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● సత్తెనపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో హనుమత్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. భీమవరం, గండ్లూరు, కట్టావారిపాలెం, పెద మక్కెనతో పాటు పలు గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు, ఆకు పూజలు జరిగాయి.



ఎండ్రాయిలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైవీ ఆంజనేయులు

మంత్రి లోకేశ్‌ను కలిసిన బాజీ చౌదరి



ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన కనుమూరి బాజీ చౌదరి

సత్తెనపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నివాసంలో గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి మర్యాద పూర్వకంగా కలిసి పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలోని నకరికల్లు మండలంలో పలు రహదారులను అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. కుంకలగుంట గ్రామంలో కాపులను బీసీల్లో చేర్చాలని, కాపు భవనం నిర్మించాలని కోరారు. కుంకలగుంట నుంచి కర్లకుంటకు వెళ్లే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్టు బాజీ చౌదరి తెలిపారు.

బద్వేలుకు చేరుకున్న బాజీ సైకిల్ యాత్ర



బాజీతో మాట్లాడుతున్న బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డి

పిడుగురాళ్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల నుంచి కడప సమీపంలో జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమానికి షేక్ బాజి సైకిల్ యాత్రగా నాలుగు రోజుల క్రితం బయలుదేరాడు. గురువారం సాయంత్రం బద్వేలు టీడీపీ కార్యాలయం వద్ద వున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డిని బాజీ కలిసి తాను చేపట్టిన సైకిల్ యాత్ర వివరాలను తెలిపాడు. పార్టీకి నిబద్ధతగా పనిచేస్తూ వందల కిలోమీటర్ల దూరం సైకిల్ యాత్ర చేస్తున్న బాజీని రితీష్‌రెడ్డితో పాటు మరికొందరు నాయకులు అభినందించారు.

వైభవంగా విశ్వేశ్వర స్వామి ప్రతిష్ఠా మహోత్సవం



ప్రతిష్ఠలో భాగంగా ధ్వజ స్తంభాన్ని పైకి ఎత్తుతున్న భక్త జన సందోహం

క్రోసూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యందనలో గంగా భ్రమరాంబిక సమేత విశ్వేశ్వర స్వామి నూతన దేవాలయ ప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు ధ్వజ స్తంభంతో పాటు దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. గుండెపూడి లక్ష్మీనారాయణశాస్త్రి, నాగరాజ శేఖరశర్మ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించారు. గణపతి, పార్వతీ అమ్మవారు, నవగ్రహాలు, నందీశ్వరుడు, ధ్వజ స్తంభం, కాలభైరవుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వీరభద్రుడు, దక్షిణామూర్తి, లక్ష్మీనారాయణ, చండీ కేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. తెల్లవారుజాము నుంచే ప్రతిష్ఠా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. అనంతరం అన్న సంతర్పణ జరిగింది. సాయంత్రం స్వామి వారి శాంతి కల్యాణం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. రూ.3 కోట్ల వ్యయంతో 50 సెంట్ల విస్తీర్ణంలో సుందరంగా ప్రతిష్ఠాత్మకంగా దేవాలయాన్ని నిర్మించారు.

పర్యావరణవేత్త జాజికి బయోడైవర్సిటీ పురస్కారం



ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నుంచి పురస్కారం అందుకుంటున్న కొమెర జాజి

కారంపూడి, మే 22 (ఆంధ్రజ్యోతి): కారంపూడికి చెందిన పర్యావరణవేత్త, ఫారెస్ట్ మ్యాన్, పర్యావరణ యోధుడు కొమెర అంకారావు అలియాస్ జాజిని బయోడైవర్సిటీ పురస్కారం వరించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ బయోడైవర్సిటీ దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్, ప్రభుత్వ అటవీశాఖ సలహాదారులు మల్లికార్జునరావులు ఈ పురస్కారం జాజికి అందించారు. జాజిని అడవితల్లి బిడ్డగా గుర్తించి గతంలో పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు వరించాయి.

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు



జిల్లా పరిషత్ కార్యాలయంలో కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు చేపట్టారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండల ఎంపీడీవో కార్యాలయం ఆఫీస్ సబార్డినేట్‌గా కూరాకుల అరవిందుకు నియామక పత్రాలను ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ గురువారం అందజేశారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కారుణ్య నియామకాల్లో భాగంగా అరవిందుకు ఈ ఉద్యోగ బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ పుల్లగూర శామ్యూల్‌పాల్, ఏవో జి.రాజారత్నబాబు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీ యువతికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న టీడీపీ నేతలు

దాచేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలో ముస్లిం మైనార్టీలకు చెందిన యువతి వివాహానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం దాచేపల్లి నగర పంచాయతీలోని టీడీపీ కార్యకర్త దివంగత షేక్ సైదా(భగ్గి) కుమార్తె వివాహం నిశ్చయమైంది. స్థానిక టీడీపీ నేతలు ఇచ్చిన సమాచారంతో తెలుగుయువత మండల అధ్యక్షుడు నాయబ్ అబ్దుల్లా ఆయనతో పాటు పఠాన్ మీరావలి, 2వ వార్డు కౌన్సిలర్ లంబు జానీ, జాకీర్ హుస్సేన్, పెద లాల, నాయబ్ సత్తార్, ముజావర్ షహీ, మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండీ నజీర్ పాల్గొన్నారు.

నవీన్ భౌతికకాయానికి యరపతినేని నిఖిల్ నివాళి

గురజాలటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణానికి చెందిన నల్లా నవీన్ ఈనెల 9వ తేదీన సైప్రస్ దేశంలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. నవీన్ మృతదేహం బుధవారం రాత్రి నవీన్ నివాసానికి చేరుకుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు, యువనేత నిఖిల్ నవీన్ నివాసానికి చేరుకొని భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.


యడ్లపాడు రణవీరాంజనేయస్వామి ఆలయంలోని స్వామివారికి వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేకం నిర్వహిస్తున్న పండితులు


సత్తెనపల్లి: మహారాష్ట్ర వీధిలో భక్తాంజనేయ స్వామిని పూలతో అలంకరించిన దృశ్యం

జై హనుమా.. వీర హనుమా

హనుమత్ జయంతి వేడుకలు గురువారం వాడవాడలా వైభవంగా జరిగాయి. పట్టణాలు, పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల్లో జై శ్రీరామ్.. జై హనుమాన్.. వీర హనుమా.. నామస్మరణలతో మారుమోగాయి. ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిశాయి. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ, తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.


తెనాలి గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠం నందు మామిడి పండ్లతో స్వామివారికి ప్రత్యేక పూజలు


వేమూరు మండలం జంపని వీరాంజనేయస్వామికి విశేష అలంకరణ చేసిన దృశ్యం

లైసెన్స్ ఉంటే.. లక్షలే

- మిర్చియార్డులో షాపు ప్రదేశాన్ని బట్టి రూ.20లక్షలు - రూ.50 లక్షల వరకు డిమాండ్
- లీజుకు ఇస్తే ఏడాదికి రూ.3లక్షల నుంచి రూ.5లక్షలు
- ఈ కారణంతోనే వాటికి విపరీతమైన డిమాండ్





గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)లో కమీషన్ ఏజంట్ లైసెన్సు పొందగలిగితే ఆ వ్యక్తి లక్షాధికారి అయినట్లే. ఇందుకు కారణం ఈ లైసెన్సుకు అంత డిమాండ్ ఉన్నది. లైసెన్సు మంజూరై యార్డులో దుకాణం మంజూరైతే దానిని ఉన్నపళంగా కొనుగోలు చేయడానికి బడా వ్యాపారస్థులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. షాపు కేటాయించిన ప్రదేశాన్ని బట్టి రూ.20 లక్షల నుంచి రూ.50లక్షల వరకు చెల్లించి తీసుకొంటారు. ఒకవేళ అమ్మడం ఇష్టం లేక సబ్‌లీజుకు ఇచ్చినా ఏడాదికి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు తెచ్చి చేతిలో పెడతారు. దీంతో మిర్చియార్డుకు కొత్త పాలకవర్గం ఏర్పడిన ప్రతీసారి ఏదో ఒకవిధంగా మార్కెటింగ్ శాఖపై ఒత్తిడి/సిఫార్సులు చేయించుకొని కమిటీలోని సభ్యులు వేరే పేర్లతో లైసెన్సులు పొందుతుంటారు.

ఏఎంసీలో కమీషన్ ఏజంట్ లైసెన్సులకు ఎల్లప్పుడూ డిమాండ్ విపరీతంగా ఉంటుంది. ఇందుకు కారణం కమీషన్ వ్యాపారి అనేక రూపాల్లో ఆదాయం పొందే అవకాశం ఉండటమే. ఒకసారి లైసెన్సు పొందితే రైతులు మిర్చియార్డుకు తీసుకొచ్చే మిరపకాయలను అమ్మిపెడితే అధికారికంగా 2 శాతం కమీషన్ వస్తుంది. అయితే అనధికారికంగా మరో రెండు నుంచి మూడు శాతం వరకు వ్యాపారస్థులు తీసుకొంటుంటారు. అలానే జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాల ద్వారా కూడా పెద్ద మొత్తంలోనే ఆదాయం సమకూరుతుంటుంది. ఈ నేపథ్యంలో లైసెన్సుపై పెట్టిన ఖర్చు అనతికాలంలోనే వెనకేసుకోవచ్చు. మిర్చి దిగుమతులు ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగినందున యార్డులో ప్రస్తుతం ఉన్న 665 కమీషన్ ఏజంట్‌లు లావాదేవీలు చేయలేకపోతున్నారు. అసలు ప్రస్తుతం 30 ఎకరాల్లో ఉన్న యార్డు ప్రాంగణమే సీజన్‌లో సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో కొత్త యార్డుని ఎక్కడైనా 100 ఎకరాల్లో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉన్నది. దీంతో అధికారంలో ఎవరుంటే వాళ్ల కొత్త కమీషన్ ఏజంట్ లైసెన్సుల పొందేందుకు ప్రయత్నిస్తుంటారు.

కాగా పాలకవర్గం ద్వారా ఎప్పటికప్పుడు కొత్త లైసెన్సుల మంజూరు కోసం ప్రతిపాదనలు రూపొందించి ఆమోదం కోసం మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌కు పంపుతుంటారు. మార్కెటింగ్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆమోదముద్ర పడితే లైసెన్సు మంజూరైనట్లే. అయితే కొత్త లైసెన్సుల విషయంలో పెద్దఎత్తున అవినీతి జరుగుతుందని ఆరోపణలు వస్తుండటంతో మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులు మిర్చియార్డు నుంచి నడుపుతున్న ఫైళ్లను పక్కన పెడుతున్నారు. ఇప్పుడు కొత్తగా 30 లైసెన్సుల వరకు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇదే సమయంలో గతంలో పక్కన పెట్టిన ఫైళ్ల దుమ్ము కూడా దులిపించి వాటిని మంజూరు చేయాల్సిందిగా కొంత మంది ఒత్తిడి చేస్తున్నారు. ఇవికనుక కార్యరూపం దాలిస్తే మరో స్కామ్‌కి యార్డు కేంద్ర బిందువు కానుంది.



మళ్లీ తెరపైకి క్లస్టర్లు

- అధికారులందరూ అందుబాటులో ఉండేలా విభజన
- గత ఐదేళ్లు సచివాలయాలతో పాలనకు ఇబ్బందులు

పిడుగురాళ్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కొరకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి త్వరితగతిన తీసుకెళ్లేందుకు ప్రభుత్వం క్లస్టర్లను తెరపైకి తీసుకొచ్చింది. 2014-19 మధ్య గ్రామ పంచాయతీలను క్లస్టర్లుగా విభజన చేసి పరిపాలనను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పంచాయతీలలో సచివాలయాల ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించింది. సచివాలయాల ఉద్యోగుల బదిలీలు, డిప్యుటేషన్‌లతో పాటు పరిపాలన సౌలభ్యంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మరలా క్లస్టర్లను తెరపైకి తీసుకొచ్చింది. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయాలను క్లస్టర్లుగా విభజిస్తూ అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. గురజాల నియోజకవర్గం వరకు చూస్తే గురజాల మండలంలో 8, దాచేపల్లి మండలంలో 7, మాచవరం మండలంలో 7, పిడుగురాళ్ల మండలంలో 7 చొప్పున క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇదేవిధంగా అన్ని మండలాల పరిధిలోనూ పంచాయతీలను క్లస్టర్లుగా విభజించనున్నారు. ఈ క్రమంలో ప్రతీ క్లస్టర్‌లోనూ ఒక వీఆర్వో, హెల్త్ అసిస్టెంట్, వ్యవసాయశాఖ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తప్పనిసరిగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయాల్లో అయితే పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉండాల్సి వుంది. క్లస్టర్‌కు కేటాయించిన అధికారులు, సచివాలయాలకు కేటాయించిన అధికారులు ఇద్దరూ సమన్వయంతో పనిచేయాలి. ఇప్పటి వరకు సచివాలయాల వ్యవస్థతో ఒక్కో సచివాలయంలో ఒక్కో వీఆర్వో, హెల్త్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ సెక్రటరి, ఎడ్యుకేషనల్ సెక్రటరితో పాటు 11 మంది ఉన్నారు. క్లస్టర్ల ఏర్పాటుతో వీఆర్వోలతో పాటు కొన్నిశాఖల అధికారుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.


ట్రాక్టర్లతో నీటిని తోడుతున్న దృశ్యం

ఐకానిక్ పనులకు ఆటంకాలు

- అకాల వర్షాలతో పునాదుల్లోకి నీరు
- వచ్చిన నీటిని వచ్చినట్లు తోడుతున్న కార్మికులు
- 30కి పైగా ట్రాక్టర్లతో భారీస్థాయిలో నీటి తోడకం
- కిందటేడాది డిసెంబరులోనే తోడేసిన ప్రభుత్వం
- తాజా వర్షాల కారణంగా మరోమారు తోడాల్సిన పరిస్థితి

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఐకానిక్ సెక్రటేరియట్ టవర్ల పనులు ముమ్మరంగా సాగుతుండగా అకాల వర్షాలు ఆటంకపరుస్తున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2న రాజధాని నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించడంతో ఐకానిక్ టవర్ల వద్ద కూడా పనులు ప్రారంభమయ్యాయి. అసెంబ్లీకి సంబంధించి మెజర్మెంట్స్ పనులు జరుగుతుండగా, సెక్రటేరియట్ పనులు పదిరోజులుగా సాగుతున్నాయి. అయితే వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు పనులను ఆటంక పరుస్తున్నాయి. అకాల వర్షాలతో పునాదుల్లోకి నీరు చేరడంతో నీటిని తోడడమే ప్రధాన పనిగా మారిపోయింది. దీంతో అసలు పని ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. సెక్రటేరియట్ భవన సముదాయం నిర్మాణంలో భాగంగా ఐదు టవర్లు నిర్మిస్తున్నారు. ఈ ఐదు టవర్ల దగ్గర 30కి పైగా ట్రాక్టర్లను పెట్టి భారీ పైపులతో నీటిని తోడుతున్నారు. తోడిన నీటిని పెద్దపెద్ద గండ్లు కొట్టి వాగుల్లోకి మరలిస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆగిపోయిన రాష్ట్ర సచివాలయం శాశ్వత భవన సముదాయాల వద్ద గత ప్రభుత్వ హయాంలో భారీగా నీరు చేరింది. ఆ నీటిని కూటమి ప్రభుత్వం వచ్చాక కిందటేడాది డిసెంబరు 27న తోడించారు. ఆ వెంటనే పనులు ప్రారంభం కాకపోవడంతో మళ్లీ పునాదుల్లోకి స్వల్పంగా నీరు చేరింది. అది పనులకు పెద్ద సమస్య కాలేదు. అయితే తాజాగా కురిసిన వర్షాలతో వరద నీరు, ఊట పెరిగి పునాదుల్లోకి నీరు భారీగా వచ్చింది. ఆ నీటిని తోడే పనులు రెండు రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే బుధవారం రాత్రి కురిసిన వర్షంతో మళ్లీ పునాదుల్లో నీరు చేరాయి. దీంతో మళ్లీ గురువారం నీరు తోడుతున్నారు. దాదాపు ఒక బిల్డింగ్ వద్ద నీరు తోడకం పూర్తవగా మిగిలిన నాలుగు టవర్ల వద్ద నీటి తోడకం పనులు వేగంగా జరుగుతున్నాయి.

సీడ్ యాక్సెస్ రోడ్డులో పోలీస్ మాక్ డ్రిల్

- నిరంతరం పటిష్టమైన భద్రత: డీఎస్పీ మురళీ కృష్ణ

తుళ్లూరు, మే 22(ఆంధ్రజ్యోతి): వీవీఐపీలు, వీఐపీలు ప్రయాణించే రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడానికి గుంటూరు జిల్లా భద్రతా విభాగం ఆధ్వర్యంలో సీడ్ యాక్సెస్ రోడ్డు మీద గురువారం ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఎస్పీ మురళీ కృష్ణ, డీఎస్‌డబ్ల్యూ ఆర్ఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. భద్రతా విభాగ పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. భద్రతా సిబ్బంది తమ వద్ద ఉన్న ఆధునిక సాంకేతిక భద్రతా పరికరాలు, శిక్షణ పొందిన జాగిలాలతో మంతెన సత్యనారాయణ ఆశ్రమం సీడ్‌యాక్సెస్ రోడ్డు మొదలు కొని ఎన్-9 రోడ్డు జంక్షన్ వరకు డివైడర్లు, చెట్ల పొదలు, పూల మొక్కల పాదులు, రోడ్డు కిరువైపులా ఉన్న కల్వర్టులు, వంతెనలు, తూములు తదితర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. భద్రతా తనిఖీలు కచ్చితత్వాన్ని పరీక్షించటానికి, జాగిలాల పని తీరుని అంచనా వేయడానికి సీడ్ యాక్సెస్ రోడ్డులోని ఒకచోట పేలుడు పదార్థాన్ని గోప్యంగా పెట్టారు. బాంబు డిస్పోజల్ విభాగానికి చెందిన ఒకజాగిలం చాకచక్యంగా సదరు పేలుడు పదార్థాన్ని కనిపెట్టింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ(ఏఆర్) హనుమంతు మాట్లాడుతూ, తనిఖీలు కచ్చితత్వాన్ని, భద్రతా ప్రమాణాలు మెరుగు పరచడానికి ఈ మాక్‌డ్రిల్ నిర్వహించినట్టు చెప్పారు. బీడీ టీం భద్రతా సిబ్బంది అన్నీ ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని తనిఖీలు(మాక్ డ్రిల్) నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ, సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి ఎటువంటి ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు, సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీడీ టీం సహకారం, సమన్వయంతో భద్రతా ప్రమాణాలు మెరుగుపరుస్తున్నట్టు చెప్పారు. రాజధానిలో భద్రతతో పాటు నిర్మాణ పనులు చేయటానికి వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికుల వివరాలను కూడా సేకరిస్తున్నామని, అన్ని దిశల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు సీఐ కొంకా శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరావు, ఎస్బీ సీఐ శ్రీహరి, జిల్లా భద్రతా విభాగ ఆర్ఐ ఉమేష్, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


జాగిలం కనిపెట్టిన పేలుడు పదార్థాలు పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ, అధికారులు


మాక్‌డ్రిల్‌లో భాగంగా పోలీసు జాగిలంతో సీడ్ యాక్సెస్ రోడ్డులో తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బంది

రేషన్ కార్డుదారులకు అసౌకర్యం కలగరాదు

- డీలర్లతో పౌరసరఫరాల మంత్రి మనోహర్

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 972 రేషన్ దుకాణాల్లో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి సరుకుల పంపిణీని డీలర్లు ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో తాడేపల్లిలోని కార్యాలయంలో సమావేశమై చర్చించారు. రేషన్ సరుకుల పంపిణీ సందర్భంగా కార్డుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగరాదన్నారు. నిత్యం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు షాపులు తెరిచి సరుకులు పంపిణీ చేయాలన్నారు. కచ్చితమైన తూకంతో సరుకులు కార్డుదారులకు ఇవ్వాలన్నారు. అలానే ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రమే వసూలు చేయాలన్నారు. దివ్యాంగులు, 60 ఏళ్ల వయస్సు పైబడిన వారికి రేషన్‌షాపు దుకాణాదారుడు నేరుగా వారి ఇంటి వద్దకే సరుకులు చేర్చాలన్నారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థకు టీడీపీ ప్రభుత్వం పునరుజ్జీవం కల్పించిందన్నారు. రేషన్ పంపిణీని పారదర్శకంగా చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వంగపాటి అంజయ్య, గుంటూరు నగర అధ్యక్షుడు తుమ్మల గాంధీ, కార్యదర్శి జిలాని, కార్యవర్గ సభ్యుడు కిశోర్ పాల్గొన్నారు.

బర్లీ పొగాకు కొనుగోళ్లపై కార్యాచరణ

పర్చూరు, మే 22(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రైతులను అదుకునేందుకు వారివద్ద ఉన్న నిల్వలను కొనుగోలు చేసేందుకు దృష్టిసారించింది. మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడుతో ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించనుంది. దీనిలో భాగంగా ఈ నెల 24న మార్టూరు మండలం ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి మంత్రుల బృందం రానున్నది. మంత్రులతోపాటు, పలువురు ఎమ్మెల్యేలు, వ్యవసాయశాఖ అధికారులు, మార్క్‌ఫెడ్, పొగాకు బోర్డు అధికారులు, కంపెనీల ప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు. మంత్రులు అధికారులు, కంపెనీ ప్రతినిధులతో చర్చించాక కొనుగోళ్లపై కార్యాచణ ప్రణాళిక రూపొందించనున్నారు.

ప్రతి రైతుకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా రైతుల మేలు కోరుతూ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతుల వద్ద ఎంతమేర బర్లీ పొగాకు ఉంది అన్న అంశంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రిఫరెన్షియల్ కేటగిరి ఉపాధ్యాయులకు వైద్య శిబిరం

గుంటూరు(విద్య), మే 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్‌లో శుక్రవారం ప్రిఫరెన్షియల్ కేటగిరి ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డీఈవో రేణుక గురువారం తెలిపారు. ఓపెన్ హార్ట్ సర్జరీ, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. గత నెలలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న వారు తాజాగా ఏర్పాటు చేసిన శిబిరంలో పాల్గొనేందుకు అనర్హులన్నారు. నిబంధనల విరుద్ధంగా తాజాగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు

దాత ఇచ్చిన ఆస్తిని కాపాడేందుకు 18 ఏళ్ల న్యాయ పోరాటం

- మూడు కోర్టులలో అనుకూలంగా తీర్పు
- పట్టువీడని బుర్రిపాలెం గ్రామస్థులు

తెనాలి అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): బాటసారుల కోసం దాత ఇచ్చిన ఆస్తిపై కన్నుపడిన అక్రమార్కుల చెర నుండి కాపాడేందుకు 18 ఏళ్ల న్యాయ పోరాటం చేశారు. మూడు కోర్టులలో అనుకూలంగా తీర్పు వచ్చే వరకు బుర్రిపాలెం గ్రామస్తులు తమ పట్టు వీడలేదు. ఎట్టకేలకు దాత ఆశయం నెరవేర్చారు. వివరాల్లోకి వెళితే.. రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన పరుచూరి సుబ్బయ్య అనే రైతు బాటసారుల విశ్రాంతి కోసం తెనాలి-చిలుమూరు మార్గంలో ప్రధాన రహదారి వెంట నాలుగు సెంట్ల స్థలం విరాళం ఇచ్చి బావి, పెంకుటిల్లు ఏర్పాటుచేశారు. విశ్రాంతి భవనంగా ఆ మార్గంలో బాటసారులకు ఎన్నో ఏళ్ల సేవలు అందించారు. ఈ భవన నిర్వహణకు అదే మార్గంలోని 52 సెంట్ల మాగాణి భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ ఆస్తిని కాపాడి బాటసారులకు ఉపయోగపడే విధంగా ఉండేందుకుగాను విక్రయ హక్కులు లేకుండా ఐదుగురు గ్రామస్తులను ట్రస్టీగా ఏర్పాటుచేశారు. వారు మరణించినా వారి సంతతి కమిటీగా కొనసాగేలా రాసి రిజిస్టర్ చేశారు. 2007లో కమిటీలోని ఒకరి కుమారుడు 52 సెంట్ల భూమిని విక్రయించేందుకు రెండు చేతులు మార్చాడు. ఇది గమనించిన ట్రస్ట్ సభ్యులు పరుచూరి రాంబాబు, బోసు దాత ఆస్తిని కాపాడేందుకు నడుం కట్టారు. తెనాలి కోర్టులో దావా వేశారు. ఈ అక్రమ వ్యవహారాన్ని 2009లో ఆంధ్రజ్యోతి కథనం కూడా ప్రచురించింది. తెనాలి కోర్టులో అనుకూలంగా తీర్పు రాగా, అక్రమార్కులు జిల్లా కోర్టు, హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా ట్రస్ట్ సభ్యులు న్యాయపోరాటం కొనసాగించారు. ఈ కోర్టులలో దాత ఆస్తిని కాపాడేలా ప్రముఖ సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు ఎలాంటి ఫీజు తీసుకోకుండా ఉచితంగా వాదించి వారికి సాయం అందించారు. బాటసారుల కోసం ఇచ్చిన దాత ఆస్తిని కాపాడేందుకు ఏళ్ల తరబడి న్యాయ పోరాటం చేసిన వీరిని గ్రామస్తులతో పాటు పలువురు అభినందిస్తున్నారు.


బాటసారుల కోసం ఏర్పాటు చేసిన వసతి


దాత ఇచ్చిన 52 సెంట్ల భూమి

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

24న మెగా రక్త దాన శిబిరం

చిలకలూరిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీన ఉదయం10 గంటలకు చిలకలూరిపేట ఎమ్మార్వో ఆఫీస్ వద్ద మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చిలకలూరిపేట రెడ్ క్రాస్ అధ్యక్షుడు, తహసీల్దార్ హుస్సేన్ గురువారం తెలిపారు. రక్తం నిల్వలు తక్కువ ఉన్న నేపథ్యంలో, ఆపద సమయంలో రక్తం అందక ఎవరు ఇబ్బంది పడకూడదనే అనే ఉద్దేశ్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గలవారు శిబిరం వద్దకు వచ్చి రక్త దానం చేయాలని కోరారు.

చిలకలూరిపేట చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకారం

చిలకలూరిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం గురువారం బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా కొత్తమాసు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆరెకట్ల కోటేశ్వరరావు, కోశాధికారిగా కొప్పురావూరి రాధాకృష్ణ, అదనపు కార్యదర్శిగా కొణిజేటి వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా రాచుమల్లు బదరీ నారాయణమూర్తి, తవ్వా నాగమల్లేశ్వరరావు, తొండపి కోటేశ్వరరావు, పోతుగంటి ప్రసాదు, సహాయ కార్యదర్శులుగా వెల్లంపల్లి శ్రీరాములు, పద్మనాభుని నారాయణ, వంకాయల శ్రీహరి పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఆధ్యాత్మిక లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన

వినుకొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): అతి పురాతనమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆవరణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విశ్వమాత గోసంరక్షణ ఆశ్రమ నిర్మాణంలో భాగంగా హనుమాన్ జయంతిని పురస్కరించుకొని సనాతన ఆధ్యాత్మిక లైబ్రరీ గదుల నిర్మాణానికి గురువారం శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ప్రతినిధి జీవీ రమణరావు కొబ్బరికాయకొట్టి పనులు ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం ఆశ్రమ నిర్మాణం చేయడం గొప్ప విషయమని, ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జాజుల మాల్యాద్రి, బద్దిక నరసింహారావు, విశ్వరూపాచారి, అంగలకుదురు ఆంజనేయులు, పిచ్చయ్య, మహిళా భక్త బృందం, భూదేవమ్మ, సరస్వతి, ధనలక్ష్మి, ఏరుగంటి కృష్ణవేణి, పిడతల రమ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌వోల అసోసియేషన్ ఏర్పాటు

రొంపిచర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఆర్‌వోల అసోసియేషన్ గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. తమ సమస్యలపై పోరాడతామని పేర్కొన్నారు. సభ్యులు ఏకాభిప్రాయం మేరకు భవిష్యత్ కార్యాచరణ కోసం వినతిపత్రాన్ని తహసీల్దార్ బండి నిర్మలకు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు పాల్గొన్నారు.

చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు 29, 30న బహిరంగ వేలం

వినుకొండ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఆధీనంలో ఉన్న చెరువుల్లో 1434 ఫసలీకి చేపలు పట్టుకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎస్.సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినుకొండ మండల పరిధిలోని నడిగడ్డ చెరువు, భారతాపురం చెరువు, ఆకులవారి చెరువులకు ఈ నెల 29వ తేదీ వినుకొండ తహసీల్దార్ కార్యాలయంలో, బొల్లాపల్లి మండల పరిధిలోని కనుమాల చెరువుకు ఈ నెల 30న బొల్లాపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 8186084999 నంబరును సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి ఉషు పోటీలకు చిలకలూరిపేట విద్యార్థుల ఎంపిక

చిలకలూరిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఆర్ క్లబ్‌లో 9 ఏళ్లుగా నిర్వహిస్తున్న న్యూ షావోలిన్ కుంగు ఫు అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఉషు పోటీలలో విజేతలుగా నిలిచి, జూన్ నెలలో జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి ఉషు పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఉషు క్రీడాకారులు బత్తుల విక్రమ్, పాలపాటి నాగరాజు, షేక్ రబ్బాని, ఎం.దుర్గాప్రసాద్, బత్తుల అభి, షేక్ తన్వీర్, జి.గగన్‌లను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అభినందించారు. వారికి ప్రత్తిపాటి స్టేట్ మెడల్స్ అందచేశారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవ అధ్యక్షుడు మద్దుల వెంకట కోటయ్య, అకాడమీ చీఫ్ ఎస్‌కే దరియావలి, మాస్టర్ యడ్ల సురేష్, కె.బ్రహ్మయ్య, కె.ప్రసాద్, బ్లాక్ బెల్టర్ సాకేత్, ఖమ్రుద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమత్ జయంతి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దంపతులు, తదితరులు

వినుకొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వినుకొండ పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో 45వ హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి లీలావతి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. జీవీ దంపతులను ఆలయ చైర్మన్ గజవల్లి నాగపవన్‌కుమార్ ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కౌన్సిలర్ షకీలా, టీడీపీ నాయకులు పి.వి.సురేష్‌బాబు, గట్టుపల్లి శ్రీనివాసరావు, పువ్వాడ కృష్ణ, స్థానిక నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని పెద్దబోరింగ్ సెంటర్‌లో కొలువైన గమిడి ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీనురాయల్, కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. అరండల్‌పేట, రామిరెడ్డిపేట, స్టేషన్ రోడ్డు, బరంపేట, పాతూరు, మెయిన్ రోడ్డు, పెద చెరువు, రెడ్డినగర్, పాలపాడు రోడ్డు, వినుకొండ రోడ్డు, రావిపాడు రోడ్డు, పాతూరులోని శ్రీభీమలింగేశ్వరస్వామి దేవాలయంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో, అయ్యప్పస్వామి దేవాలయంలోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. పట్టాభిరామస్వామి దేవాలయంలోని ఆంజనేయస్వామికి, పమిడిపాడులోని భారీ విగ్రహానికి, ఉప్పలపాడులోని ఆంజనేయస్వామి విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకాలతో పాటు తమల పాకులతో అర్చనలు ఘనంగా నిర్వహించారు. అభిషేకాల అనంతరం ఆయా ఆలయాల్లో ఆంజనేయ స్వామికి విశేష అలంకారాలు చేశారు.



రామిరెడ్డిపేటలోని ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న షిరిడి సాయిబాబా మందిరంలో హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ అభయాంజనేయ స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్వామికి ప్రీతికరమైన తమల పాకులతో పూజలు చేశారు. మన్యుసూక్త పారాయణం హోమం వైభవంగా జరిగింది. స్వామివారిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు స్వామివారి అన్నప్రసాదం, మామిడి పండ్లు, విసనకర్రలు అందజేశారు. పట్టణంలోని పాలపాడు రోడ్డు ప్రశాంతి నగర్‌లోని చిన్నసింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ప్రసన్నాంజనేయ స్వామికి విశేష ద్రవ్యములతో అభిషేకం, అర్చన, 1008 మామిడి పండ్లతో సహస్రనామార్చన, హోమాలు నిర్వహించారు. భారీగా భోజన ప్రసాద వితరణ జరిగింది. కోలాటాలు, భజనలతో హన్‌మాన్ శోభాయాత్ర జరిగింది. ప్రసన్నాంజనేయస్వామిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట రావిళ్ల నాగేశ్వరరావు, గుత్తా అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ బీ శ్రీనివాసరావు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని రామిరెడ్డిపేటలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో



చిలకలూరిపేట చైత్రా సెంటర్ గుడిలో, కొచ్చెర్లలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు, ఎండుగుంపాలెంలో ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి

ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. పార్లమెంట్ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఆ పరిసర ప్రాంతాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొప్పూడి ఆంజనేయస్వామి దేవస్థానంలో, చైత్రా సెంటర్ వీరాంజనేయస్వామి గుడిలో, సుబ్బయ్యతోట ఆంజనేయస్వామి గుడిలో, పోలిరెడ్డిపాలెం అభయాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. చైత్రా సెంటర్ సెంటర్లో ఉన్న వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో సాయంత్రం తమలపాకులు, మల్లెలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళహారతి కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా పట్టణంలోని పురుషోత్తమపట్నం ప్రసన్నాంజనేయస్వామి, 6వ వార్డులోని ఆంజనేయస్వామి ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు.

● కనమర్లపూడి (శావల్యాపురం): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని కనమర్లపూడిలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కనున్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద తిరునాళ్ల వేడుకలను భక్తులు గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని వడ్డెర కాలనీవాసులంతా కలసి రాజకీయాలకు అతీతంగా దేవాలయం వద్ద విద్యుత్ ప్రభ నిర్మించి సాంస్కృతిక కార్యక్రమాలు



సాయిబాబు మందిరంలోని అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, తదితరులు

ఏర్పాటు చేశారు. గ్రామంలోని తూర్పుబజారుకు చెందిన ఉప్పు కోటేశ్వరరావు తిరునాళ్లకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. రూరల్ సీఐ ప్రభాకర్‌రావు, ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావు తిరునాళ్ళలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

● యడ్లపాడు: హనుమజ్జయంతిని మండల ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయాలతోపాటు పలు రామాలయాలలో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు. యడ్లపాడు శ్రీరణవీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జంధ్యాల శ్రీరామచంద్రమూర్తి నేతృత్వంలోని పండితుల బృందం వేద మంత్రోచ్చరణల మధ్య 21 ద్రవ్యాలతో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారిని వెండి ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి లక్ష నాగవల్లీ దళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఐదువేల మందికి అన్నదానం చేశారు. బోయపాలెం శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని అర్చకులు పరాంకుశం హనుమాచార్యులు, రంగాచార్యుల నేతృత్వంలో సుదర్శన హోమం నిర్వహించారు. స్వామివారికి వివిధ రకాల పండ్లు, పూలతో విశేషంగా అలంకరించారు. చెంఘీజ్‌ఖాన్‌పేట, తిమ్మాపురం, కొండవీడు, కొత్తపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో గురువారం హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రొంపిచర్ల, గోగులపాడు, అలవాల, దద్దనాలమిట్ట, విప్పర్ల, నలగార్లపాడు, మాచవరం, పరగటిచర్ల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో, ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివార్లకు పంచామృతాభిషేకం, నాగవల్లి దళార్చన పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేశారు.

● ఈపూరు: మండలంలోని ఈపూరు బోటుమీద ప్రసన్నాంజనేయస్వామికి, కొచ్చెర్ల చెరువుకట్టమీద ఆంజనేయస్వామికి, కొండ్రముట్ల, బొగ్గరం గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

● నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్ల, వీ అప్పాపురం, ముక్కెళ్ళపాడు, రవ్వవరం, ఐనవోలు, రవ్వవరం శ్రీ వెంకటేశ్వర జగన్మాతపీఠం తదితర గ్రామాల్లో దీక్షా స్వాములు హనుమత్ వ్రతాలు నిర్వహించి ఆంజనేయ స్వామికి ఆకు పూజ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

● నాదెండ్ల: మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని వీరాంజనేయుని దేవాలయం, గ్రామంలోని కోదండ రాముని దేవాలయాలు, ఎండుగుంపాలెం గ్రామ సమీపంలోని సువర్చల సమేత ఆంజనేయ స్వామి దేవాలయంతో పాటు పలు గ్రామాల్లో హనుమత్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గణపవరంలో 108 కలశాలు, 108 లడ్డులతో అభిషేకం నిర్వహించారు. లక్ష మల్లెపూలతో స్వామివారిని అలంకరించారు. ఆయా గ్రామాల్లో ఆకు పూజ, సిందూర పూజలు నిర్వహించారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి, కురవకింద ఆంజనేయ స్వామి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

పేద విద్యార్థులకు చేయూతనివ్వండి

విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద, అనాథ విద్యార్థులకు చేయూతనివ్వాలని విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం నరసరావుపేటలోని కమ్మ బాలికల వసతి గృహంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద పిల్లలకు సహకరించడం అంటే కేవలం వసతి, భోజనం కాదని, వాళ్ళ సోషల్ స్కిల్స్, సమాజంలో సర్దుబాటు, ఒకరి ఒకరు సహకరించుకోవడం తదితర సామాజిక అంశాలలో కూడా ముందు ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. చదువుతో పాటు మంచి భవిష్యత్ కోసం, సంస్కారం, సంస్కృతి నేర్చుకుంటారని చెప్పారు. వసతి గృహాలలో ఎవరి పనులు వారే చేసుకునేలా తయారుచేసి వారు మంచి పౌరులుగా తయారుచేయాల్సి ఉందన్నారు. పల్నాడు పిల్లలో ఫైర్ ఉందని, వారిని ఒక చోట చేర్చి సహకరిస్తే సమాజానికి ఉపయోగపడేలా వారిలోని సృజనాత్మకతను ప్రోత్సహించాలని చెప్పారు. ఇప్పటికే వినుకొండ, కోటప్పకొండ, నరసరావుపేట, కపిలేశ్వరం, తదితర తొమ్మిది చోట్ల ఇలాంటి వసతి గృహాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా నరసరావుపేటలో బాలికల వసతి గృహానికి చొరవ తీసుకోవాలని కోరారు. స్థానికంగా వాలంటీర్‌గా సేవలు అందించడం, ఆర్థిక సహకారం, ఇతర సేవలు అందించేందుకు ముందుకు రావాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు, పక్కన విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

ఈ సందర్భంగా ఏబీ వెంకటేశ్వరరావు వసతి గృహ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి రవీంద్ర, కృష్ణ చైతన్య విద్యాసంస్థల అధినేత కొల్లి బ్రహ్మయ్య, డాక్టర్ యనిగండ్ల మధుసూదనరావు, డాక్టర్ ఓగూరి కోటయ్య, కే నాసరయ్య, ఎంఎఎం విద్యాసంస్థల అధినేత ఎంఆర్ శేషగిరిరావు, లాం కోటేశ్వరరావు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ బాలికల హాస్టల్‌కు సహకారం అందిస్తా: చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ బాలికల హాస్టల్‌కు తన వంతు సహకారాన్ని అందజేస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులోని కాకతీయ బాలికల హాస్టల్‌ను గురువారం విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావుతో కలిసి జీవీ ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన బాలికల కోసం హాస్టల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ ఆస్తుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. హైదరాబాద్‌లోని కాకతీయ సేవా ట్రస్ట్ సీఈవో మాజీ రిటైర్డు ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు సేవా గుణంతో కాకతీయ ట్రస్ట్‌కు పనిచేయాల అన్నారు. ఏబీ వెంకటేశ్వరరావు చేస్తున్న సేవలు అభినందదనీయమని విశ్రాంత లెక్చరర్ కాకతీయ సేవా సమితి సభ్యుడు గడిపూడి వెంకటరాయుడు అన్నారు. వినుకొండలో కాకతీయ బాలికల హాస్టల్‌కు ప్రతి సంవత్సరం మూడు లక్షల రూపాయలు అందజేస్తామని ప్రభుత్వం చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, గడిపూడి వెంకటరాయుడు లక్ష రూపాయలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పొట్ల రాధాకృష్ణమూర్తి, లగడపాటి వెంకట్రావు, యార్లగడ్డ లెనిన్, గోరంట్ల సత్యనారాయణ, చెరుకూరి ప్రసాదరావు తదితరులు ఉన్నారు.



జల కళను సంతరించుకున్న గుండ్లకమ్మ

నూజెండ్ల మండలంలో 10.6 మిల్లీ మీటర్ల వర్షపాతం

నూజెండ్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి పడిన వర్షం 10.6 మిల్లీ మీటర్లుగా నమోదైంది. భారీ వర్షానికి వాగులు, వంకలు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వర్షపు నీటితో గుండ్లకమ్మ నది జల కళను సంతరించుకుంది. మిర్చి, పొగాకు రైతులను కొంత మేర ఇబ్బంది పెట్టినా వేసవి కాలంలో పడిన వర్షం వ్యవసాయ పనులు ప్రారంభించుకోవటానికి ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.



కొత్తపాలెంలో పీఎండీఎస్ పద్ధతిలో సాగుచేసిన పంటలను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

గర్భిణులు అర్హులైన వైద్యులను సంప్రదించాలి

● డీఎంహెచ్‌వో బి.రవి

నరసరావుపేట లీగల్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని గర్భిణులు అర్హులైన వైద్యులను సంప్రదించాలని నాటు వైద్యులను సంప్రదించవద్దని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ బి రవి ఒక ప్రకటనలో కోరారు. గర్భిణులు బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రి లలో వైద్యం పొందటం వలన మాతా శిశు మరణాలు నియంత్రించవచ్చన్నారు. 9 నెలల్లో కనీసం రెండుసార్లు స్కానింగ్ తప్పనిసరని గర్భస్థ శిశువుల పెరుగుదల తెలుసుకునేందుకు, జన్యుపరమైన వ్యాధులు, అంగవైకల్యాలు నిర్ధారించుకునేందుకు ప్రతి గర్భిణి అర్హులైన వైద్యులనే సంప్రదించాలన్నారు. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా హాస్పిటల్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ఉచితంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాను సారం పీసీఅండ్ పీఎన్ డీటీ యాక్టు 22ప్రకారం ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లు, ఇతర ప్రచార సాధనాల ద్వారా కూడా స్కానింగ్ సెంటర్‌కు సంబంధించి స్కానింగ్ ముందు గాని, తరువాత గాని లింగ నిర్ధారణ గురించి ఎటువంటి వాణిజ్య ప్రకటనలు చేయరాదని సూచించారు. ఆలా ఎవరైనా స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు లింగనిర్ధారణపై ప్రకటనలు ఇస్తే వారిపై చట్ట ప్రకారం జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం కఠినచర్యలు ఉంటాయన్నారు. జిల్లా అప్రాప్రియేట్ అథారిటీలో నమోదై సంబంధిత హాస్పిటల్స్ చట్టంలోని సూచనలు కచ్చితంగా పాటించాలని లేకుంటే తగిన జరిమానా, జైలు శిక్ష విధించటం జరుగుతుందన్నారు. లింగ నిర్ధారణ వివరాలు వెల్లడించడం, చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, దానిని ప్రోత్సహించిన వారికి మూడు నుంచి ఐదు సంవత్సరాలు జైలు శిక్ష రూ.50,000 నుంచి రూ.1,00,000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఏ హాస్పిటల్ గాని, డైగ్నోసిస్ సెంటర్ గాని, రిజిస్టర్ కాకుండా నిర్వహించరాదన్నారు. వీటిని నిబంధనలకు అనుగుణంగా నిర్వహించకుంటే చట్టప్రకారం శిక్షార్హులు అని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహిస్తున్న వారిపై 18004253365కు ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. అదేవిధంగా (సరోగసీ) యాక్ట్ 2021, శిశు హత్యల నివారణ యాక్టు పటిష్టంగా అమలు చేయడంలో ప్రైవేట్ హాస్పిటల్స్ డయాగ్నిసిస్ సెంటర్‌ల నిర్వాహకులు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్‌ల వారు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవి కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సాంబశివరావు పాల్గొన్నారు.

నకిలీ మస్టర్లు వేస్తే కఠిన చర్యలు

● డ్వామా పీడీ సిద్దలింగమూర్తి

ఈపూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ మస్టర్లు వేసినా, యంత్రాలతో పనులు చేసినా చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ సిద్దలింగమూర్తి అన్నారు. మండలంలోని గోపువారిపాలెం, బొమ్మరాజుపల్లి గ్రామాలలో ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాలలో సేద్యపు నీటికుంటలను సందర్శించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పనులకు అధిక సంఖ్యలో శ్రామికులు పాల్గొనేలా చూడాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా పీడీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో రోజుకు 1.20లక్షల మంది పనికి వచ్చేలా లక్ష్యంగా పెట్టుకోగా ప్రస్తుతం 1.09 లక్షలు మంది హాజరవుతున్నారన్నారు. వర్షం కారణంగా పనులకు వచ్చే వారి సంఖ్య తగ్గిందన్నారు. ముఖ్యంగా సేద్యపు నీటికుంటలు, ఇంకుడు గుంతలు, కంపోస్ట్ పిట్స్, ఫీడర్ చానల్, చెరువు పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 1118 సేద్యపు కుంటలకు గాను ప్రస్తుతం 494 పూర్తయ్యాయన్నారు. అదేవిధంగా 5300 ఇంకుడు గుంతలకు గాను 2వేల729 పూర్తి చేయడం జరిగిందన్నారు. నకిలీ మస్టర్లను తనిఖీ చేసి వారిపై చర్య తీసుకుంటామన్నారు. ప్రతి ఉపాధి శ్రామికుడు రూ.300లు కూలీ తీసుకునేలా పని కల్పిస్తామన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పిస్తామన్నారు. అంతేకాకుండా ప్రతి ఉపాధి శ్రామికుడు బీమా చేయించుకోవాలన్నారు. ప్రీమియం ఏడాదికి రూ.20, రూ.436 చెల్లించాలన్నారు. పీఎం ఎస్‌ఈవై, పీఎం జేజేబీవై బీమా పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే యోగాంధ్రలో భాగంగా ప్రతి ఉపాధి శ్రామికుడు రిజిష్టర్ చేయించుకోవాలన్నారు. జాబ్ కార్డు ఉన్న శ్రామికులకు ప్రమాదం జరిగితే గతంలో చెల్లించే పరిహారం రూ 50వేల నుంచి రూ 2లక్షల వరకు పెరిగిందన్నారు. సమావేశంలో ఎంపీడీవో కే ప్రభాకర్, ఏపీవో పుష్పరాజ్, టీసీలు, పాల్గొన్నారు.

రైతన్నలకు అండగా ప్రకృతి సేద్యం

● డీపీఎం అమలకుమారి

యడ్లపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతన్నలకు కొండంత అండగా నిలుస్తుందని ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజరు అమలకుమారి అన్నారు. మండలంలోని కొత్తపాలెంలో రైతులు తిరుపతిరావు, నాగేశ్వరరావులు ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానంలో సాగుచేసిన పప్పు, నూనె, తీగెజాతి పంటలను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసారాన్ని పెంపొందించడం, బహుళ పంటల సాగు, ప్రజలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించడం ప్రకృతి వ్యవసాయం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రధాన పంట వేసుకోవడానికి 40 రోజులు ముందుగా నేలను సారవంతం చేసే 30 రకాల పప్పు, నూనె, తీగె జాతి పంటలను సాగుచేసుకోవాలన్నారు. ఇలా చేయడం వలన జీవ వైవిధ్యంతోపాటు భూమిలో కర్బనశాతం పెరుగుతుందన్నారు. పీఎండీఎస్ విధానంలో సాగుచేసిన పంటలు పశువులకు గ్రాసంగా కూడా ఉపయోగపడుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు, భూసారాన్ని పెంచేందుకు ఈ విధానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. నవ ధాన్యాల పేరుతో 30రకాల విత్తనాలతో కూడిన కిట్లను డ్వాక్రా సంఘాల ద్వారా తయారుచేయించి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందించనున్నట్లు వెల్లడించారు. పల్నాడు జిల్లాలోని రైతులందరూ నవ ధాన్యాల సాగుతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.